

- మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి రవాణా
- తక్కువ ధరకే లభిస్తుండడంతో ఆసక్తి చూపుతున్న మద్యం ప్రియులు
- అధికారులు దాడులు చేస్తున్నా ఆగని వైనం

జోరుగా దేశీదారు దందా



జిల్లాలో దేశీదారు దందా జోరుగా సాగుతున్నది. కొందరు దీనినే వృత్తిగా మార్చుకొని మహారాష్ట్ర నుంచి బస్సులు, రైళ్లలో ఇక్కడికి తరలిస్తూ సొమ్ము చేసుకుం టున్నారు. అధికారులు దాడులు చేస్తున్నా అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు.

కాగజ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేశీదారు దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మహారాష్ట్ర కేంద్రంగా ఈ దందాను సాగిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పట్టుకుంటున్నా అక్రమార్కులు బెదరడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం దేశీదారు దందాపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ కూడా పూర్తి స్థాయిలో నిలువరించలేకపోతున్నారు. మహారాష్ట్రకు సరిహద్దునే ఉన్న ఆసిఫాబాద్ జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్ర స్తుతం మహారాష్ట్ర దేశీ మద్యం ఏరులై పారుతోంది. వివిధ రకాల పేర్లతో అక్కడి బ్రేవరేజ్స్ తయారు చేస్తున్న దేశీదార్ ధర తక్కువగా ఉంది. దీంతో సరి హద్దు ప్రాంతాల్లో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయ లుగా వర్థిల్లితోంది. ముఖ్యంగా కిక్ అధికంగా ఉండడంతో మందుబాబులు దేశీదారు వైపు ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు చెబుతున్నారు. ఇక్కడి మద్యం ధరలు కూడా అధికంగా ఉండడం పరోక్షంగా మహారాష్ట్ర నుంచి దేశీదార్ స్మగ్లింగ్‌కు ఊత మిస్తోందన్న ఆరోపణలున్నాయి. రెండేళ్ల క్రితం వరకు మహారాష్ట్రలో ఇక్కడి వ్యాపారులు ఆ డిందే ఆటగా అమ్మిందే మందుగా సాగింది. గడ్చిరోలి చంద్రాపూర్ జిల్లాలో మహారాష్ట్ర జిల్లాలో పాక్షిక మద్య నిషేధాన్ని అమలు చేశారు. దీతో మందుబాబులకు మద్యం అందుబాటులో లేకుండా పోయింది. ఈ క్రమంలో మహారాష్ట్రకు పొరుగునే ఉన్న ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి, వాంకిడి, సిర్పూరు, కౌటాల, చింతలమా నేపల్లి, బెజ్జూరు, మద్యం దుకాణాల నుంచి భారీ ఎత్తున ఐఎంఎల్ మద్యం మహారాష్ట్రకు తరలించుకుపోయారు. దాంతో ఈ సరిహద్దు దుకాణాలకు టెండర్లలో కోట్లాది రూపాయిలు ధర పలికింది. ముఖ్యంగా అహరి రాజూరా ప్రాంతాల నుంచి మద్యం స్మగ్లర్లు ఇక్కడ పెద్ద ఎత్తున కొనుగోలు చేసి అటు చంద్రాపూర్, ఇటు గడ్చిరోలి గోందియా వరకు తమ నెట్ వర్క్ ద్వారా తెలంగాణ మద్యాన్ని స్మగ్లింగ్ చేసుకొని భారీ స్థాయిలో సొమ్ము చేసుకున్నారు.

● రెండేళ్ల క్రితం..

పరిస్థితులను గమనించిన మహారాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం చంద్రపూర్ జిల్లాలో మద్య నిషేధాన్ని ఎత్తి వేసింది. ప్రస్తుతం గడ్చిరోలి జిల్లాలో మాత్రమే మద్య నిషేధాన్ని అమలు చేస్తోంది. గడ్చిరోలి జిల్లాలో తెలంగాణ మద్యం కంటే ప్రస్తుతం మహారాష్ట్ర ఐఎంఎల్, దేశీదార్ విక్రయాలు భారీగా సాగుతున్నట్లు ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. ఎక్సైజ్ శాఖ సైతం ఇదే విష యాన్ని స్పష్టం చేస్తోంది. ఫలితంగా మహారాష్ట్రకు విక్రయాలు నిలిచి పోయాయి. జిల్లాలోని సరిహద్దు మద్యం దుకాణాలు విక్రయాలు లేక ఆర్థికంగా కుదేలు అయ్యే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. దానికి తోడు స్థానికంగా గుడుంబా తయారీ కూడా మళ్లీ పుంజుకుంటున్నట్టు సమాచారం. ఈ క్రమంలో కొంత కాలంగా జిల్లా ఎక్సైజ్ యం త్రాంగం దేశీదార్‌పై దృష్టి సారించి స్మగ్లింగ్ జరుగుతున్న మార్గాలపై నిఘా పెట్టింది. కానీ స్మగ్లర్లు ఎక్సైజ్ యంత్రాంగాన్ని బురిడి కొట్టించి మరి జిల్లాలోకి దేశీదారును స్మగ్లింగ్ చేస్తు న్నట్టు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్ర రివర్స్ పంచ్‌తో ఇక్కడి ఎక్సైజ్ యంత్రాంగం ఖంగు తినగ మద్యం వ్యాపారుల నుంచి దేశీదారు నియంత్రం చేయాలంటూ ఎక్సైజ్‌పై తీవ్రంగా ఒత్తిడి పెరుగుతున్నట్టు చెబుతు న్నారు. ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్ శాఖ ప్రతి రోజు ఏదో ఒక చోట దాడులు నిర్వహిస్తున్న దేశీదారు లేదా మహారాష్ట్ర మద్యాన్ని పట్టుకుంటుంది. దాంతో పాటు స్థానికంగా తయారీదారులపై దృష్టి సారించి దాడులు నిర్వహిస్తూ బైండోవర్‌లను పెంచుతుంది. దేశీదారు స్మగ్లింగ్, గుడుంబా తయారీ విక్రయాలపై ఉక్కు పాదం మోపుతూ ఇందులో భారీగా జరిమానాలు విధిస్తున్నారు. ఇటీవల కొన్ని కేసుల్లో ఒక్కొక్కరికి లక్ష చొప్పున జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేసి బైండోవర్ చేశారు.

● జిల్లాలోని రెండు డివిజన్లలో..

జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్లలో మొత్తం 30 మద్యం దుకాణాలు ఉన్నా యి. దేశీదారు కారణంగా 40 నుంచి 45 శాతం విక్రయాల్లో తగ్గుదల నమోదు అయినట్టు గుర్తించారు. ఆ రాష్ట్రంలో లభించే దేశీదారు క్వార్టర్ సీసా ధర రూ. 60గా ఉంది. మన దగ్గర దొరికే చీప్‌లిక్కర్ ధర రూ. 110 ఉంది. తక్కువ ధర ఉండడంతో మద్యం ప్రియులు దేశీదారు వైపు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది కాలంగా రెండు సర్కిళ్ల పరిధిలో జరిపిన దాడుల్లో దేశీదారు బాటిళ్ల పట్టుబడ్డాయి. ఈ మేరకు పలువురిపై కేసులు నమో దు చేశారు. ఇందులో ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలో మొత్తం 450 దేశీదారు సీసాలను పట్టుకున్నారు. ఆరుగు రిపై కేసు నమోదు చేశారు. ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగజ్‌నగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 23 కేసులు నమోదయ్యాయి. 21 మందిని అదుపులోకి తీసుకున్నారు. 8 వాహనాలను స్వాధీనం చేసుకొని పది మందిని బైండోవర్ చేశారు. మొత్తం 177 లీటర్ల పరిమాణంలో 1,212 సీసాల దేశీదారును స్వాధీనం చేసుకున్నామని అధికారులు వెల్లడించారు.

దేశీదారు నియంత్రణకు నిఘా..

- రవికుమార్, ఎక్సైజ్ సీఐ కాగజ్‌నగర్



దేశీదారు నియంత్రణకు పకడ్బందీ నిఘా పెట్టాం. మహారాష్ట్ర నుంచి సిర్పూరు నియోజకవర్గానికి వచ్చే దారులపై తనిఖీలు చేపడుతున్నాం. రైలు మార్గాల్లోనూ తరలించకుండా చర్యలు తీసుకుంటున్నాం. దేశీదారుతో పట్టుబడిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నాం. ఇటీవల కొందరికి జరిమానా విధించాం.

కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేశ్

ఆసిఫాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేశ్ అన్నారు. కోర్టు ప్రాంగణంలో శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి యువరాజా, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మిలతో కలిసి బార్ అసోసియేషన్ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో సివిల్, క్రిమినల్, కాంపౌండబుల్ కేసులను రాజీ చేయడానికి కక్షిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సందర్భంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, అందులో రాజీ పడన్ను కేసుల వివరాలపై చర్చించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీసీపీవో మహేష్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామానికి చెందిన మైనర్‌కు వివాహం చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు శుక్రవారం గ్రామానికి వెళ్లి బంధువులు, కుటుంబ సభ్యులు, కుల పెద్దలకు కౌన్సెలింగ్ చేశారు. ఆయన వెంట సోషల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేర్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, 16 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం తప్పిపోయి కాగజ్‌నగర్‌కు చేరుకున్న బాలుడిని శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. సికింద్రాబాద్ నుంచి మే 9వ తేదీన తప్పిపోయిన ఓ బాలుడు దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా కాగజ్‌నగర్ రైల్వేస్టేష న్‌కు చేరుకున్నాడు. రైల్వే పోలీసులు అతడిని గుర్తించి ఆసిఫాబాద్ బాలరక్షణ భవన్ సిబ్బందికి అప్పగించారు. బాలుడికి కౌన్సెలింగ్ నిర్వహించి వివరాలు సేకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలనాడు జిల్లాగా చెప్పడంతో బాలుడి తల్లిని పిలిపించి ఆమెకు బాల రక్ష భవన్‌లో శుక్రవారం అప్పగించారు. వేసవి సెలవుల అనంతరం బాలుడిని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అనంతరం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి వారి సొంత గ్రామానికి పంపించారు. కార్యక్రమంలో బాలరక్ష భవన్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, బాలప్రవీణ్‌కుమార్, ఝాన్సీ రాణి, ప్రవీణ్‌కుమార్, బూర్ల మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలి

కౌటాల, మే 16 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఎంఈవో హనుమంతు అన్నారు. ముందస్తు బడిబాట కార్యమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో వసతులు, ఉచిత నోట్‌బుక్స్ టెస్ట్ బుక్ పంపిణీ, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మౌనిక, సీసీ విలాస్, ఉపా ధ్యాయులు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

'అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలు'

చింతలమానేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): అధికారిని అడ్డం పెట్టుకొని మాజీ ఎంపీపీ అక్రమాలకు పాల్పడ్డారని పలువురు భూ బాధితులు ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. అనుకోడ శివారులో, గూడెం శివారులో, డబ్బా ఇతర తదితర ప్రాంతాల్లో భూ ఆక్రమణకు పాల్పడి దొంగ పట్టాలు చేసుకున్నారని చెప్పారు. తమ భూమిని కాపాడు కునేందుకు న్యాయస్థానాల ద్వారా పోరాటం సాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భూ బాధితులు శంకర్, సూర్యబాయి, కమల్‌కుమార్, కొండయ్య, మహేష్, శ్రీను, పున్నాబాయి, కవిత తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చులో పులి మృతి..?

ఆసిఫాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం అటవీ రేంజ్ పరిధిలో వేటగాళ్ల ఉచ్చుకు పులి మృతి చెందినట్టు తెలుస్తోంది. అటవీ శాఖ అధికారులు శుక్రవారం పూడ్చిపెట్టిన వన్యప్రాణి కళేబారాన్ని గుర్తించినట్టు సమాచారం. మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చి పులిని చంపి పూడ్చివేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కళేబరం పూర్తిగా గుర్తు పట్టని విధంగా ఉన్నట్టు తెలుస్తోంది. సంఘటన స్థలంలో ఫోరెన్సిక్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం. మృతి చెందినది పులినా-చిరుత పులినా అనే విషయం తెలియాల్సి ఉంది. పెంచికల్‌పేట అటవీ రేంజ్ పరిధిలో కే8 పెద్దపులి ఐదేళ్లుగా సంచరిస్తోంది. మృతి చెందింది కే8 పెద్దపులియేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాని అటవీశాఖ అధికారులు మాత్రం కళేబరం దేనిది అనేది ఇంకా ధ్రువీకరించడం లేదు.

ఎస్పీఎం సెక్యూరిటీ గార్డు మృతి

కాగజ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం మిల్లులో శుక్రవారం సెక్యూరిటీ గార్డు వేణు(38) మృతి చెందారు. ఉదయం నుంచి మిల్లులో చేరిన వేణు ఒక్కసారిగా వాంతులు చేసుకోవడంతో సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్సల కోసం మంచిర్యాలలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించి మృతిచెందారు. వేణు మృతి క్లోరిన్ గ్యాస్‌తోనే మృతి చెంది ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇంకా ఎస్పీఎం యాజమాన్యం, అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఈ విషయమై టౌన్ సీఐని వివరణ కోరగా వేణు అనే సెక్యూరిటీ గార్డు మృతి చెందినట్టు తెలిసిందని, ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మిల్లు ఎదుట కాలనీవాసుల నిరసన

కాగజ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం పరిసర ప్రాంతాల్లోని కాలనీ వాసులు శుక్రవారం ఎస్పీఎం గేటు ఎదుట నిరసన తెలిపారు. మిల్లు నుంచి భరించలేని గ్యాస్ వస్తోందని, చర్యలు తీసుకోవాలని కోరారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

కాగజ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు బడీడు పిల్లలను తప్పకుండా పాఠశాలల్లో చేర్పించాలని కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి కటకం మధూకర్ అన్నారు. భట్టుపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన పిల్లల విద్యతోనే వారికి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా బడికి పంపేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అరిగెల జన్మదిన వేడుకలు



కేక్ పంచుతున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్రావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్‌యాదవ్, పెంటయ్య, ముర్షర్, ప్రసాద్‌గౌడ్, ప్రహ్లాద్, జయరాజ్, శ్రీకాంత్, దీపక్, సత్యనారాయణ, వెంకన్న, సంతోష్, శ్రీశైలం, విలాస్, సురేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీపీఎం నాయకుడి మృతి

కాగజ్‌నగర్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకులు రామిల్ల తిమ్మారావు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన తుది శ్వాస విడిచారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ ఆనంద్, నాయకులు మిట్టపల్లి ప్రభాకర్, సుదర్శన్, రఘు, సీఐటీయూ నాయకులు సంజీవ్, శంకర్, చంద్రయ్య, మల్లయ్య, చంద్రశేఖర్ తిమ్మారావు మృత దేహానికి నివాళులు అర్పించారు.

రోడ్డు నిర్మించాలని నిరసన

ఆసిఫాబాద్, మే 16 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రధాన రహ దారి గుంతల మయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే నిర్మాణం చేపట్టాలని శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డు గుంతల మయంగా మారడంతో గుంతల్లో నీరు చేరి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వాహనాలు అదుపుతప్పి పడిపోయి గాయపడిన సంఘటనలు సైతం ఉన్నాయని తెలిపారు. అధికారులు వెంటనే పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శ్రావణి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాగజ్‌నగర్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్-రాళ్లపేట రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కాగజ్‌నగర్ జీఆర్పీ ఔట్ పోస్టు ఇన్‌చార్జి సురేష్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వంజిరి సమీపంలో పట్టాలు దాడుతుండగా బల్హార్ష నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రైలు ఢీకొనండతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, బ్రౌన్ వైట్ లైనింగ్ ఫుల్ షర్టు, సిమెంట్ కలర్ నైట్ ప్యాంటు మృతుడు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామని తెలిపారు. సమాచారం తెలిస్తే 9948481902, 8712658605 నంబర్లకు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్

కెరమెరి, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గోయగాం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్ అన్నారు. మండలంలోని గోయగాం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌హెచ్‌సీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, యువకులను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సీపీ సుజాత, సీసీ సత్యనారాయణ, వీఓ రాధాభాయి, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): బడి బయట ఉన్న పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించాలని హెచ్ఎం వినయ్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులు, స్వయం సహయక సంఘ సభ్యులకు, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు వ్యవసాయ పనులకు, కూలి పనులకు పంపిచవద్దని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్థులు పాల్గొన్నారు.

25న కోనేరు అభిమానుల ఆత్మీయ సభ

కౌటాల, మే 16 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండల కేంద్రంలో ఈ నెల 25న కోనేరు అభిమానుల ఆత్మీయ సభ నిర్వహించనున్నామని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య అన్నారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తదితరులు హాజరవుతారని తెలిపారు.

రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి

తిర్యాణి, మే 16 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని ఏవో వినయ్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కిరాణ దుకాణాల్లో ఫర్టిలైజర్స్, పురుగుల మందులు విక్ర యించ కూడదన్నారు. రైతులు పురుగుల మందులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నకిలీ విత్తనాలు తక్కువ ధరకు వస్తున్నాయని కొనుగోలు చేస్తే పంట నష్టం జరుగుతుందని సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట

సిర్పూర్(టి), మే 16 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మీదుగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు భారీ వాహనాల రాకపోకల నియంత్రణ కోసం మండలంలోని వెంక్రటావుపేట గ్రామ సమీపంలో గ్రామస్థులు రోడ్డుపై ఇనుప గ్రిడ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో భారీ వాహనాల రాక పోకలకు అడ్డుకట్ట పడినట్లయింది. భారీ వాహనాల రాక పోకలతో ప్రమాదాలు జరుగుతు న్నాయని, రోడ్లు దెబ్బతింటున్నాయని పలుమార్లు అధికారులకు విన్నవించామని పలువురు గ్రామస్థులు తెలిపారు. ఎవరు పట్టించుకోక పోవడంతో పోలీసుల సహకారంతో గ్రామస్థులు స్వయంగా రోడ్డుకు అడ్డంగా ఇనుప గ్రిడ్‌లను ఏర్పాటు చేశారు.



వెంకట్రావ్‌పేట సమీపంలో ఏర్పాటు చేసిన ఇనుప గ్రిడ్‌లు

బకాయిల కోసం కార్మికుల ఎదురుచూపు



సర్‌సిల్క్ మిల్లు ప్రాంతం

కాగజ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): సర్‌సిల్క్ మిల్లు కార్మికులు బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. 1984లో బిర్లా యాజమాన్యం, ట్రేడ్ యూనియన్ల మధ్య తలెత్తిన అగ్రిమెంటు వివాదంతో మిల్లు మూతబడింది. కార్మికులు దశల వారీగా పోరాటం చేసిన తర్వాత ప్రయివేటు యాజమాన్యాల పెట్టుబడులు, ఐడీబీఐ బ్యాంకర్ల సహకా రంతో తిరిగి 1994లో పునఃప్రారం భించారు. మార్కెట్‌లో పోటీ తత్వం పెరగడంతో ఈ మిల్లు నుంచి ఉత్పత్తి అయ్యే సిల్క్ బట్టలకు డిమాండు ధర లేక పోవటంతో 2001న శాశ్వతంగా మూసివేశారు. తమకు రావల్సిన జీత భత్యాలు, గ్రాట్యూటీ ఇతరాత్ర బకాయిలు చెల్లించాలని హైకోర్టులో 2001లో కార్మికులు కేసు వేశారు. హైకోర్టు ప్రత్యేకంగా లిక్విడేటర్‌ను నియమించి మిల్లు ఆస్తులను విక్రయించి బకాయిలు చెల్లించాలని సూచించింది. ఈ దిశగా మొదట విడతలో కార్మికులకు 2008లో మిల్లు ఆస్తులు రూ.18.5 కోట్లకు అమ్మకాలు ఓపెన్ టెండర్ ద్వారా చేసి మొదటి విడత కార్మికులకు గ్రాట్యూటీ బకాయిలు చెల్లించారు. రెండో దఫాలు రూ.13 కోట్ల చెల్లించాల్సి ఉంది.. హైకోర్టు లిక్విడే టర్ ఆధ్వర్యంలో మిల్లు స్థలాలు అమ్మేందుకు 2008 ప్రక్రియ పూర్తి చేసిన కార్మికులు రూ.18.5 కోట్ల డబ్బులను పంపిణీ చేశారు. ఇంకా రూ.13 కోట్ల నిధులు అవసరం ఉంది. తమకు డబ్బులు వస్తాయన్న కొండంత ఆశతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం కార్మికులు పూర్తిగా వయస్సుమీద పడిఉన్నారు. కొంత మంది కార్మికులు చని పోయారు. రూ.13 కోట్ల డబ్బులు 1000 పర్మినెంటు కార్మికులు, 500 మంది స్టాఫ్ ఉద్యోగులు, 1000 డైలీ వర్కర్స్‌కు చెల్లించాల్సి ఉంది. 2008 నుంచి వీరంతా డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ ఈ ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఓ వైపు మిల్లు స్థలాలు అమ్మేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు ఖాళీ స్థలాలపై కొంత మంది కన్నేసి బాహాటంగానే కబ్జా చేస్తున్నారు. ప్రస్తుతం మిల్లు ఖాళీ స్థలం, షాపింగ్ కాంప్లెక్సులు, బలగాలతో ఉన్న 50 ఎకరాల స్థలాన్ని విక్రయించాల్సి ఉంది. ఈ ప్రక్రియ వేగవంతం కాకపోడంతో యథేచ్ఛగా అక్రమణలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు నోటీసులిస్తున్నప్పటికీ కూడా కబ్జాలు ఆగడం లేదని చెబుతున్నారు.

బకాయిలు చెల్లించాలి..



సర్‌సిల్క్ మిల్లు కార్మికులు బకాయివు చెల్లించాలి. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. అలాగే టెక్స్‌టైల్ వర్కర్స్ రిహాబిటేషన్ ప్యాకేజీ కింద 18 నెలల జీతం వస్తుందని ఎదురు చూస్తున్నారు. అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలి.

- అంబాల ఓదెలు, బీఆర్ఎస్ నాయకుడు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

అంజద్‌పాషా, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. అందులో భాగంగా 28 గ్రామాలను గుర్తించాం. మహారాజ్‌గూడ గ్రామంలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాం. మిగిలిన గ్రామాల్లో మంచినీటి వనరులకు మరమ్మతులు చేస్తున్నాం. బాబేఝరి, శివగూడ గ్రామంలో ఉపాధి హామీ ద్వారా బావులు తవ్విస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కోసం ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారు?

ఎంపీడీవో: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా మండలంలో 1,757 దరఖాస్తులు వచ్చాయి. ఇంటర్వ్యూకు 1,490 మంది హాజరయ్యారు. త్వరలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ సూచనల మేరకు మంజూరు పత్రాలు అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంపీడీవో: మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులను కమిటీల ద్వారా ఎంపిక చేస్తున్నాం. కోటారి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశాం. 108 గృహాలు మంజూరయ్యాయి. 30 ఇళ్లు పిల్లర్ల దశ వరకు పూర్తయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. నివేదికలు అధికారులను అందజేశాం. అనుమతులు రాగానే ఇంటి నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

- కెరమెరి, ఆంధ్రజ్యోతి

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

అకాల వర్షాలతో అన్నదాతల ఆందోళన

దహెగాం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. పది రోజులుగా అకాల వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో పలు చోట్ల ఈదురు గాలులతో పాటు వర్షం కురవడంతో ధాన్యం కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడ్డారు. ఓ పక్క అకాల వర్షాలు కురుస్తున్నా ధాన్యం తడిసినష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరబోసిన రైతులు ధాన్యం కొనుగోలు ఎప్పుడు చేపడుతారని ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు గాలి దుమారం వస్తుందో ఎప్పుడు అకాల వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు పేర్కొన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ధాన్యం కాపాడుకోవడానికి తంటాలు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. రైస్ మిల్లుల కేటాయింపు ఆలస్యం కావడంతో ధాన్యం తరలింపు ఆలస్యం అవుతుందని రైతులు చర్చించుకుంటున్నారు.



చంద్రపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్(ఫైల్)

జిల్లాలో 20,143 ఎకరాల్లో..

జిల్లాలో 15 మండలాల్లో యాసంగిలో 20,143 ఎకరాల్లో వరి సాగు చేశారు. దహెగాం మండలంలో 7,956 ఎకరాల్లో వరి అధికంగా రైతులు సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 34 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా 56 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా అధికారులు అంచనాగా నిర్ణయించుకున్నారు. క్వింటాలుకు ఏ-గ్రేడ్ ధాన్యం ధర రూ.2,320, సాధారణ రకం రూ.2,300 చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వం సన్న రకం ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి అదనంగా రైతులకు రూ.500 బోనస్ క్వింటాలుకు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పింది. కానీ ప్రైవేటు వ్యాపారులు ఎలాంటి నిబంధనలు విధించకుండా ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో ప్రైవేటుకు తరలి పోతోంది. దొడ్డురకం ధాన్యం నాణ్యతను బట్టి క్వింటాలుకు వ్యాపారులు రూ.1700 నుంచి రూ.1900 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని స్థానిక మిల్లులతో పాటు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలోని రైస్ మిల్లులకు ధాన్యం తరలించి ప్రైవేటు వ్యాపారులు విక్రయిస్తున్నారు. సన్నరకం ధాన్యాన్ని ఎలాంటి షరతులు పెట్టకుండా క్వింటాలుకు రూ.2000 చెల్లించి ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేపడుతున్నారు.



పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే..

చెమ్మకారి గంగన్న, కౌలు రైతు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోసి పదిహేను రోజులు అయింది. ధాన్యం ప్యాడీ క్లీనర్‌లో తూర్పార పోశాం. సంచుల కోసం ఎదురు చూస్తున్నాం. సంచులలో కాంటా చేసి లారీలలో ధాన్యం బస్తాలు తొందరగా తరలించాలి. పదిహేను రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నాం. ఏడు ఎకరాలు కౌలుకు తీసుకు దొడ్డురకం వరి సాగు చేశాను.

వారం రోజులు అయింది..

దాసరి కిషన్, కౌలు రైతు

కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోసి వారం రోజులైంది. అకాల వర్షాలు, గాలి దుమారంతో ఇబ్బంది పడుతున్నాం. హత్తిని గ్రామంలో 15 ఎకరాలు వరి పొలం కౌలుకు తీసుకుని దొడ్డురకం సాగు చేశాను. అధికారులు తొందరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

కడుపునొప్పితో యువకుడి ఆత్మహత్య

తిర్యాణి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాయిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని చందుగూడ గ్రామానికి చెందిన కుర్సింగె గోపాల్(27) అనే యువకుడు కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్ మూడేళ్లుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా నయం కావడం లేదు. దీంతో మనస్తాపం చెంది గురువారం పొలంలో పురుగుల మందు తాగి సోదరి కమలకు ఫోన్ ద్వారా తెలిపాడు. వెంటనే గోపాల్‌ను బెల్లంపల్లి సింగరేణి ఆసపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

40 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



విత్తనాలు స్వాధీనం చేసుకుంటున్న ఏవో, పోలీసులు

నెన్నెల, మే 16 (ఆంధ్రజ్యోతి): నందులపల్లి గ్రామానికి చెందిన తోట వెంకటేశం అనే వ్యక్తి వద్ద శుక్రవారం 40 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి నకిలీ పత్తి విత్తనాలు వచ్చినట్టు మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజనకు సమాచారం రావడంతో ఆమె ఫిర్యాదు మేరకు నందులపల్లి ప్రాజెక్టు ప్రాంతంలో గాలించారు. వెంకటేశం అనుమానాస్పదంగా తిరుగుతూ, రెండు సంచులను తన చేనులో దాచేందుకు ప్రయత్నిస్తూ కనిపించడంతో అతడిని పట్టుకొని విచారించారు. మందమర్రికి చెందిన పిండి సురేష్ వద్ద 40 కేజీల లూజు పత్తి విత్తనాలను రూ. 1.20 లక్షలు చెల్లించి కొనుగోలు చేసినట్టు ఒప్పుకున్నాడని చెప్పారు. విత్తన సంచులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మహిళలు చదువుకుంటే మోసాలను అరికట్టవచ్చు

కాసిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు చదువుకోవడం వల్ల విజ్ఞాన వంతులై సమాజంలో జరిగే మోసాలను అరికట్టవచ్చునని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం లంబడితండ, పెద్దనపల్లిలో నిర్వహిస్తున్న వయోజన విద్యా అభ్యాసన కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు వయస్సుతో నిమిత్తం లేదన్నారు. ప్రతి ఒక్కరు కూడ చదువుకొని విజ్ఞాన వంతులు కావాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. మండలాన్ని వందశాతం అక్షరాస్యతగా తీర్చిదిద్దేందుకు మండలాన్ని దత్తత తీసుకున్నామన్నారు. అందులో భాగంగానే అభ్యాసన కేంద్రాలను ఏర్పాటు చేసి వృత్తి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యాసన కేంద్రాల్లో కుట్టు శిక్షణ కేంద్రంతో పాటు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి ద్వారా మహిళలు ఆర్థిక స్వాలంబన పొంది ఆర్థికంగా బలపడుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యా అధి కారి పురుషోత్తం నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గ ప్రసాద్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీఈవో వెంక టేశ్వర్లు, ఎల్‌డీఎం తిరుపతి, సెక్టోరల్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి, మోడల్ స్కూల్ ఇన్‌చార్జి శ్రీనివాసచారి, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

బెల్లంపల్లి, మే16(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఏసీపీ రవికుమార్ అన్నారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని మూడు దేవాలయాల్లో, రెండు మసీదులలో 22 సీసీ కెమెరాలు ప్రార ంభించి మాట్లాడారు. ప్రస్తుతం రోజు రోజుకు సీసీకెమెరాల ప్రాధాన్యత పెరుగుతుందని నేరాల నియంత్రణకు ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రధానపాత్ర పోషిస్తున్నాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. అనంతరం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నవారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య పాల్గొన్నారు.

బైరవ స్వామికి పూజలు

కోటపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాల సందర్భంగా కాళేశ్వరానికి వచ్చిన కాకినాడకు చెందిన శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి శుక్రవారం మండలంలోని పారుపెల్లి గ్రామ సమీపంలోని భైరవ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భైరవ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. లోక కల్యాణార్థం పూజలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక భక్తులు పాల్గొని ఆయనకు స్వాగతం పలికారు.

ప్రజల మెప్పు పొందే చట్టం భూ భారతి

- భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం
- త్వరలో సర్వేయర్ల నియామకం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పెంచికలపేట/ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల మెప్పు పొందే చట్టం భూ భారతి అని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పెంచికలపేటలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు వేల ప్రభుత్వ సర్వేయర్లు, వెయి మంది లైసెన్స్ సర్వేయర్ల నియమాకం త్వరలో చేపట్టనున్నామని చెప్పారు. వచ్చే జూన్ 2 నాటికి గ్రామ రెవె న్యూ అధికారుల పునర్నిమాయకం చేపట్టనున్నామని తెలిపారు. ధరణిలో గత కొన్ని సంవత్సరాలుగా భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రజల మెప్పు పొందని ధరణి చట్టం వల్లే బీఆర్‌ఎస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిందని చెప్పారు. ప్రస్తుతం తాము రూపొందించినభూ భారతి చట్టం ప్రతి ఇంటికి చుట్టంగా వస్తోందన్నారు. ఎలాంటి సమస్యలున్నా కూడా అప్పీల్ వ్యవస్థను రూపొందించామని తెలిపారు. తహసీల్దార్‌తో సమస్య పరిష్కారం కాకుంటే సబ్ కలెక్టర్, ఆపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇక్కడ కూడా పరిష్కారం కాకుండా నేరుగా సీసీఎల్‌ఎకు కూడా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. భూ సమస్య విషయంలో అధికారులు అవకతవకలకు పాల్పడితే వారిపై కూడా చర్యలు తీసుకునేది భూ భారతి చట్టం అని పేర్కొన్నారు. త్వరలోనే భూ భారతి ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబరు కూడా తీసుకొస్తున్నామని చెప్పారు. పోడు రైతుల విషయంలో అటవీ శాఖ అధికారులు ఒత్తిడి చేయకూడదని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నాతమ దృష్టికి తీసుకరావలన్నారు. అలాగే వివాదస్పద భూములపై కూడా జాయింట్ సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు ఆదేశించారు. ఇంటి నిర్మాణాల విషయంలో అడ్డుకోరాదని అటవీ శాఖ అధికారులకు సూచించారు. త్వరలోనే గిరివికాస్ ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్టు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ ధరణిలో అధికారులకు సమస్యలను పరిష్కరించే అవకాశం లేకుండా ఉండేదన్నారు. ప్రతి సమస్య కూడా కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కాని భూభారతి చట్టం రైతులందరికి భరోసా ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ భూ భారతి చట్టంలో జీపీఆర్‌ఎస్ ఫొటోతో పాటు పక్కనున్న భూముల సర్వే నంబర్లు, పేర్లు స్పష్టంగా పొందుపరుచడం వల్ల ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ధరణిలో లోపాలను సవరిస్తూ నూతన చట్టం తీసుకరావడం అభినందనీయమని కొనియా డారు. ఈ చట్టం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ కొత్త చట్టంలో ప్రతీ సమస్యకు పరిష్కారం చూపే విధంగా రూపొందించామని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన పెంచికల్‌పేట మండలంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 236 దరఖాస్తులు వివిధ భూ సమస్యలపై అందాయని తెలిపారు.. ఇందులో 84 సమస్యలను పరిష్కరించామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సీనియర్ నాయకుడు వేణుగోపాలాచారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, డీఎఫ్‌ఓ నీరజ్ కుమార్ టిబ్రేవాల్, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా, తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, ఎంపీడీఓ ఆల్‌బర్ట్, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్, మాజీ జడ్పీటీసీ సముద్రాల సరిత, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు రాచకొండ కృష్ణ, రాజన్న, సదాశివ్, రామారావు, శ్రీనివాస్, శ్రీవర్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, తదితరులు

మంత్రికి వినతుల వెల్లువ

రెవెన్యూ అవగాహన సదస్సుకు హాజరైన మంత్రులకు ప్రజలు వినతి పత్రాలను అందజేశారు. సభా ముగియగానే సమస్యలు పరిష్కరించాలని నేరుగా మంత్రికి వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. కాగా మంత్రుల సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ నుంచి సభా స్థలి వరకు అడుగడుగున పోలీసులు నిఘా పెట్టారు. ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ కరుణకర్ బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తిర్యాణి, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖైరిగూడ పంచాయతీలోని సౌగాడ్ గ్రామానికి చెందిన మెస్రం యేసు(50) అనే వృద్ధుడు గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డాడు. యేసు నిత్యావసర సరుకుల కోసం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో రోడ్డుపై రెండు ఎద్దులు పోట్లాడుకుంటు వాహనాన్ని ఢీ కొట్టాయి. దీంతో అతను కింద పడి పోయాడు. తలకు బయలమైన గాయాలు కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. యేసు కుమారుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

జన్నారం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇందన్‌పల్లి రేంజ్‌లోని కొత్తపేట గ్రామ శివారులోని కవ్వాల టైగర్ కంపార్టుమెంట్ 243 నర్సింహుల గుట్ట చెరువులో ఒక జేసీబీతో మట్టిని తీసి 20 ట్రాక్టర్లలో తరలిస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. శుక్రవారం తాము అక్కడకు వెళ్లి వీడియోలు తీయగా తాము ఫారెస్టు అధికారుల అనుమతులతో తీస్తున్నామని పేర్కొన్నారని గ్రామస్థులు తెలిపారు. రిజర్వు కంపార్టుమెంట్‌లోని మట్టిని అనుమతులు తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఫారెస్టు ఉన్నతాధికారులు అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని కోరారు. ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు., విచారణలో అక్రమాలకు పాల్పడిన విషయం తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.



వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు, అధికారులు వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. స్థానిక జీఎం కార్యాలయంలో రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. రక్తపోటు పరీక్షలు చేయించుకున్నారు. జీఎం మాట్లాడుతూ వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. బీపీ, షుగర్ పరీక్షలు ఎప్పటికప్పుడు చెక్ చేయించుకోవాలన్నారు. కొన్ని వ్యాధులు వంశపారపర్యంగా వస్తాయని , వైద్యులను సంప్రదించడం ద్వారా వీటిని నివారించవచ్చని తెలిపారు. రక్తపోటు ఉన్న వారు మనో వేదనకు గురి కావద్దని, మందులు వాడితే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్మికులు, అధికారులు, ప్రజలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి పౌష్టికాహారం, పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు యోగా, వ్యాయామం, వాకింగ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, అధికారుల సంఘం అధ్యక్షుడు నరేష్, కేకే 1 డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు

శ్రీరాంపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకు బీపీ, షుగర్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని జీఎం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ఎవరికైనా అనారోగ్య సమస్య ఉన్నట్లయితే సింగరేణి డిస్పెన్సరీల ద్వారా చికిత్స పొందవచ్చన్నారు. తీవ్రమైన తలనొప్పి, అలసట, ఛాతిలో నొప్పి, శ్వాసతీసుకో వడంలో ఇబ్బంది, గుండె కొట్టుకోవడంలో మార్పు, తల తిరగడం, నీరసం వంటి సమస్యలు ఉన్నట్లయితే తప్పనిసరిగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు. ప్రతి రోజు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని సూచించారు. డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో బీపీ, షుగర్, తదితర రుగ్మతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనా రాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘ ఏరియా ఉపాధ్యక్షుడు కె కిరణ్ కుమార్, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, పర్సనల్ మేనేజర్ ఎ రాజేశ్వర్,తదితరులు పాల్గొన్నారు.

స్టార్ రేటింగ్ పొందడం అభినందనీయం

శ్రీరాంపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్ కే న్యూటెక్ గని స్టార్ రేటింగ్ పొందడం అభినందనీ యమని ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. గని ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 144 బొగ్గు గనుల్లో ఆర్కే న్యూటెక్ మూడో స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. భూగర్భ గనుల్లో ఉత్తమ ఓఎంఎస్(ఉత్పాదకత) సాధించినట్లు చెప్పారు. ఉద్యోగులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. గనిలోని 1వ సీమ్‌లో మిగిలిన బొగ్గును వెలికితీసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, ఏజెంట్ రాజేందర్, మేనేజర్ స్వామిరాజు, గ్రూపు ఇంజనీర్ రవిచరణ్, రక్షణాధికారి కొట్టె రమేష్, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు వసతుల కల్పన

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పనిచేసే మహిళా ఉద్యోగులకు పలు వసతులు కల్పిస్తున్నట్లు ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఆర్కే 7 గనిలో నిర్మించిన రెస్ట్‌హాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాం చ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి సంతోష్, సంక్షేమాధికారి సంతన్, పిట్ కార్యదర్శి సారయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

క్రీడాకారులకు జీఎం అభినందన

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి రీజియన్‌కు చెందిన క్రికెట్ క్రీడాకారు లను శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ శుక్రవారం అభినందించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు సింగరేణి అధికారుల క్రికెట్ జట్లకు కొత్తగూడెంలో పోటీలు నిర్వహించారు. ఇందులో విజయం సాధించిన బెల్లంపల్లి రీజియన్ జట్టు సభ్యులు అభినందనీయులన్నారు. సిరీస్ మొత్తంలో బెల్లంపల్లి రీజియన్ జట్టుకు చెందిన తిరుపతి ఉత్తమ బ్యాటర్‌గా, రాజేందర్ ఉత్తమ బౌలర్‌గా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం (ఫైనాన్) బీబత్స, బెల్లంపల్లి రీజియన్ క్రికెట్ జట్టు కెప్టెన్ డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి, సభ్యులు రాజేందర్, కిరణ్ కుమార్, దావూద్, శశాంక్, సుధీర్, మధుసూదన్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె వాయిదా



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు దాగాం మల్లేశ్

కాసిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వాయిదా వేస్తున్నట్లు జాతీయ సంఘాలు ప్రకటించినట్లు ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్ అన్నారు. శుక్రవారం కాసిపేట 1వ గనిపై ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న పహల్గాంలో అమాయక ప్రజలపై జరిగిన ఉగ్రదాడిని ఉమ్మడి వేదిక తీవ్రంగా ఖండించిందని చెప్పారు. దేశంలో విభజనాత్మక ద్వేషపూరిత ప్రచారాన్ని చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. . దేశవ్యాప్తంగా పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జులై 9కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ, రాజేందర్, పర్వతి సురేశ్, శ్రీహరి, చౌడ లింగయ్య, కమలాకర్, సంతోస్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

శ్రీరాంపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గని మైసమ్మ ఆలయంలో శుక్రవారం వివిధ పూజలు నిర్వహించారు. ఉదయం గడప ప్రతిష్టాపన, ఆభరణాల అలంకరణలు చేపట్టారు. అనంతరం డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ సతీమణి మాలతి మాట్లాడుతూ మైసమ్మ తల్లి దీవెనలతో ఆర్కే 6 గని అన్ని రంగాల్లో ఉత్తమంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, అమ్మవారి కృపతో ఉద్యోగులు క్షేమంగా ఉంటున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా మాట్లాడుతూ, గని 50 ఏళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు.





ఎడ్ల బండిపై ప్రయాణం, పుణ్యస్నానం ఆచరిస్తున్న యువతులు



స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచిఉన్న భక్తులు





పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు

ఆధ్యాత్మిక పుష్కరం.. అలౌకిక ఆనందం

- అంతర్వాహినిలో మునక.. పుణ్యస్నానాలకు ప్రతీక
- రెండో రోజు పోటెత్తిన భక్తజనం





పిండ ప్రదానం



కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): పుష్కరస్నానం.. సకల పాప హరణం.. అని భావించే భక్తఘనకోటి సరస్వతీ పుష్కరాల్లో రెండో రోజున అంతర్వాహిని రూపంలో ఉన్న సరస్వతీ నదీ మాతల్లికి భక్తజనం నీరాజనం పలికింది. తొలిరోజు భక్తులసంఖ్య పలుచగా కనిపించినా.. రెండో రోజైన శుక్రవారం ఉదయం నుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. శుక్రవారం సాయంత్రం వరకు కాళేశ్వరం దర్శించుకున్న భక్తుల సంఖ్య 50వేలు దాటిందని అధికారులు అంచనా వేశారు. అయితే పుష్కరాల నిర్వహణలో అధికారుల వైఫల్యంతో అడుగడుగునా ఇబ్బందులు ఎదురైనా.. భక్తులు వీటన్నింటిని తోసిరాజని పుష్కర స్నానాలు ఆచరించి క్షేత్రంలో కొలువై ఉన్న ఆ మహాదేవున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

50 వేలకు పెరిగిన భక్తుల సంఖ్య

తొలిరోజు కొంత భక్తులు తక్కువ వచ్చినప్పటికీ.. రెండో రోజు సుమారు 50వేలకు పైగా భక్తులు వచ్చారు. కాళేశ్వరంలోని రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్, పోలీసులు ఉన్నప్పటికీ ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అన్ని చౌరస్తాల వద్ద పోలీసులు ఉన్నప్పటికీ భక్తులు ఎలా వెళ్లాలో, ఎటు నుంచి వెళ్లాలో ఎవరూ చెప్పిన దాఖలాలు లేవు. కనీసం చౌరస్తాల వద్ద సూచన బోర్డులు కూడా పెట్టకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 300 ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, వివిధ ప్రైవేటు వాహనాలు సుమారు 2800 వరకు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తంగా సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చినట్లు తెలిపారు. సరస్వతీ ఘా ట్, ప్రధానఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తజనం

సరస్వతీ పుష్కరాల సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. సరస్వతీ నదిలో స్నానమాచరించిన అనంతరం నేరుగా ఆలయానికి వచ్చి శివ, యమ లింగాలను దర్శించుకున్నారు. అయితే వీఐపీలు వచ్చిన సందర్భంగా భక్తులను గంటసేపు నిలిపివేయడంతో తీవ్ర అసంతృప్తికి గురైన భక్తులు ఆలయ అధికారుల పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే పోలీసులు సైతం అత్యుత్సాహం చూపి భక్తులను సరైన పద్ధతిలో పంపించడం లేదని విమర్శలు చేశారు.



పేరుకే రెవెన్యూ డివిజన్..

(5వ పేజీ తరువాయి)

భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు సైతం కనీసం కూర్చోవడానికి గదులు లేకపోవడం, అత్యవసర సమయంలో మరుగుదొడ్లు, మూత్ర శాలలు లేకపోవ డంతో ప్రజలు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు వెళ్లిన సమయంలో కార్యాలయాల ఆవరణలో ఉన్న చెట్ల కింద వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది.

● ప్రభుత్వ స్థలాలున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడి ఏండ్లు గడుస్తునప్పటికీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించలేదు. బెల్లంపల్లిలో వందల ఎకరాల్లో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ శాశ్వత భవనాల నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు కృషి చేయడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి సొంత భవనాలకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలను చేపట్టేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

బెల్లంపల్లి, మే16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఆర్డీవో హరిక్రిష్ణకు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి నవీన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2024లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని ఉప ముఖ్య మంత్రి చెప్పినప్పటికీ నేటికి విడుదల చేయలేదన్నారు. నాయకులు నర్సింగ్, శ్రీనివాస్, శ్యామ్‌జీ, నవీన్‌లు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ శ్రీధర్

జైపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో యువతిని మోస గించిన యువకున్ని శుక్రవారం అరెస్టు చేసినట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాన్కూర్ గ్రామానికి చెందిన యువతికి హైద్రాబాద్‌లోని మెహదీపట్నంకు చెందిన ఆకాష్ గుప్త అనే యువకునికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్ప డింది. ఆకాష్ గుప్త యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి హైద్రాబాద్‌కు తీసుకువెళ్లి యువతి బంగారాన్ని తాకట్టు పెట్టి రూ. 17,500లను తీసుకున్నాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకోమని యువతి అడిగితే ఆకాష్ గుప్త తన ఇంట్లో ఒప్పుకోవడం లేదని మాయమా టలు చెప్పి యువతిని మోసం చేశాడు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై కేసు నమోదు

నెన్నెల, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టిన కీసరి సాయి కుమార్ అనే వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ భూమి సర్వే నంబరు 876లో అక్రమంగా ఇంటి పని చేపడుతున్నారని పేర్కొన్నారు. అది ప్రభుత్వ భూమిగా సర్వేలో తేలినప్పటికి నిర్మానం చేపడుతున్నారని ఆర్‌ఐ సులోచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మే16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా వారి వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి విక్రయ కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైసు మిల్లర్లు లక్ష్యాన్ని త్వరిగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. రైసు మిల్లర్లు నిర్దేశిత లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎంఆర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు డీసీఎస్‌వో బ్రహ్మారావు, డీఎం శ్రీకళ, పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

●జిల్లా కేంద్రంలో పాత మంచిర్యాలలో నిర్వహించ తలపెట్టిన మహిళ భవనం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం జిల్లా కేంద్రంలో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకరావాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించారు.

●మైనార్టీ విద్యా సంస్థల్లో ప్రభుత్వం అందిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో మైనార్టీ గురుకులాల విద్య సంస్థల సంబంధిత అడ్మిషన్ల గోడ ప్రతులను విడుదల చేశారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నీరటి రాజేశ్వరి, అకాడమి సమన్వయ కర్త రిజ్వాన్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

●జిల్లాలో ఇసుక తీసేందుకు నిబంధనలను అనుసరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని కలెక్టరేట్ భవన సముదాయంలో అడిషనల్ కలెక్టర్ సబావత్ మోతిలాల్ కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. చెన్నూర్ మండల కేంద్రంలో ఇసుక తీసేందుకు వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించామన్నారు. అందిన దరఖాస్తులపై జిల్లా రెవెన్యూ, నీటి పారుదల, భూగర్భజల, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయ, మైన్స్, జువాలజీ, టీజీఎండీసీ తదితర శాఖల సమ్వయంతో సమగ్ర విచారణ జరిపి అనుమతి జారీ చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు.

బోర్‌వెల్ ఏర్పాటు

మందమర్రిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాపీ భవన నిర్మాణ సంఘం కార్యాలయం ఆవరణలో శుక్రవారం బోర్‌వెల్ పనులను భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు బండి సదానందం యాదవ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంఘం కార్యాలయంలో తాగునీటి సౌకర్యం లేదని, ప్రహరీ గోడ లేదని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్లగా తన సొంత నిధులతో బోర్‌వెల్, మోటారు మంజూరు చేశారని తెలిపారు. త్వరలోనే ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. నాయకులు తిరుమల్‌రెడ్డి, రాంరెడ్డి, నాగుల దుర్గయ్య, రాజన్న, రాయమల్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కాసిపేట, మే16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదుగురు లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ అం దజేశారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యం భారినపడి ఆసుపత్రి పాలై ఆర్థికంగా నష్టపోయిన ఐదుగురు నిరుపేద కుటుంబాలకు లక్ష30వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, మే16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డు కాంటాక్టర్ బస్తీ సమస్యలు పరిస్కరించాలని శుక్రవారం వార్డు ప్రజలు మాట్లాడారు. వార్డులో డ్రైనేజీని మున్సిపల్ అధికారులు శుభ్రం పరుచకపోవడంతో బురద నీరు ఇండ్లలోకి ఇబ్బందులు పడుతున్నామ న్నారు. కాంటాక్టర్ బస్తీలో దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. వార్డు సభ్యులు పరిష్కరించాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిదులు స్పందించి వార్డు సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటాలు

బెల్లంపల్లి, మే16(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన సీపీఐ పార్టీ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అన్నారు. శుక్రవారం పట్టణంలో సీపీఐ కార్యాలయంలో ఈ నెల 25న కా మ్రేడ్ గంగారాం విజ్ఞాన భవన్‌లో సీపీఐ మహాసభల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. నియోజక వర్గం నుంచి ఈ మహాసభకు సీపీఐ నాయకలు పెద్ద హాజరు కావాలని పేర్కొన్నారు. సీపీఐ పార్టీ వంద సంవత్సరాలు ప్రజల తరుపున వివిధ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిందన్నారు. 70 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో నేటికి పేదరికంలో నిరుద్యోగ సమస్యల్లో బాధపడుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమ పతకాలను అమలు చేయాలన్నారు. బెల్లంపల్లి పట్టణంలో నివసిస్తున్న ప్రజలు ఇండ్ల పట్టాలు లేక మంచినీటి సరఫరా సక్రమంగా ఉండక విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు వెంకటస్వామి, రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్య వర్గ సభ్యులు, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు ఉపేందర్, రత్నం రాజం పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న పంచముఖ ఆంజనేయ ఆలయం

రజతోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు

మందమర్రిటౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం రజతోత్సవ వేడుకలకు ముస్తాబైంది. ఈ ఆలయ నిర్మాణం జరిగి శనివారంతో 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఐదు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం శోభయాత్రతో ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయి. శనివారం సాయంత్రం శోభయాత్రకు త్రిదండి దేవానంద రామానుజ జీయర్ స్వామి హాజరుకానున్నారు. ఈ వేడుకల నేపథ్యంలో ఆలయంలో శుక్రవారం సర్వాంత సుందరంగా తీర్చిదిద్దారు. పూలమాలలతో అలంకరించారు. పెద్ద ఎత్తున మహిళ భక్తులు పాల్గొని స్వామివారి సేవలో నిమగ్నమయ్యారు. ఆలయం చుట్టు పువ్వులతో అందంగా ముస్తాబు చేశారు. దీంతో పాటు మూడు రోజుల పాటు నిర్వహించే ఆలయంలో హోమగుండాలు ఏర్పాటు చేసి వాటి చుట్టూ కూడ ముస్తాబు చేశారు. భక్తుల కోసం ఆలయం సమీపంలోని ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా టెంట్లు వేశారు. తాగునీరు సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. 22న ముగింపు ఉత్సవానికి చినజీయర్ స్వామి హాజరుకానున్నారు. ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



ఆలయంలో పూలమాలలు అల్లుతున్న మహిళ భక్తులు

అంతర్ జిల్లా చెక్‌పోస్టు ప్రారంభం

జన్నారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి అటవీ ప్రాంతంలో అంతర్ జిల్లా చెక్‌పోస్టును మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వాహనాలను తనిఖీ చేశారు. ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లా అటవీ ప్రాంతంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి సమాచారం ఉన్నా తనిఖీలు చేపట్టవచ్చని, అలాగే స్మగ్లింగ్ వంటి వాటిని అరికట్టవచ్చని తెలిపారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రశీదులు లేకుండా పశువులను వాహనాల్లో తర లిస్తుండగా వాహనాలను సీజ్ చేశారు. ఆయన వెంట లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్‌ఐ రాజవర్ధన్ ఉన్నారు.

బియ్యం అందజేత

జన్నారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రామన్న హనుమాన్ జయంతి సందర్భంగా పొనకల్ సుందరయ్య నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయానికి పూర్ణచందర్‌రావు ఫౌం డేషన్ సభ్యులు శుక్రవారం 50కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రవీణ్ కుమార్, సభ్యులు శంకర్, ప్రశాంత్, కుమార్, గంగన్న, గ్రామస్తులు నిరోషా, విజయ, జయ , కవిత పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శుక్రవారం అందుగులపేటలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును పరిశీలించారు. విద్యార్థుల నృత్యాలు, ఆటలను ఆయన పరిశీలించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు బయట తిరగకుండా సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వీరేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోటపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : కిష్టంపేట నుంచి కోటపల్లి వెళ్లే 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కోటపల్లి, ఆల్గామ, దేవులవాడ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాసిపేట: కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం పీడర్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్‌పీడీసీఎల్ డీఈ రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

చెన్నూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా సరస్వతి పుష్కరాలకు వస్తున్న భక్తుల దాహార్తీని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు

హాజీపూర్, మే16(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్‌తెలంగాణ వ్యవ సాయ విశ్వవిద్యాలయం వారి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసా యశాఖ శుక్రవారం మండలంలోని ర్యాలీ గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కోట శివరామకృష్ణ మాట్లాడుతూ రైతులు సాగులో యూరియా వాడకం తగ్గించి సాగు ఖర్చు తగ్గించాలని అవసరం మేరకే రసాయనాలు వినియోగించడం వలన నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడినవార మవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయశాఖ ఏడీఏ అనిత, హాజీపూర్ ఎఫ్‌పీవో డైరెక్టర్‌లు శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పయ్యావుల పద్మముని, మండల వ్యవసాయాధికారి క్రిష్ణ, ఏఈవోలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన

భీమిని, మే 16 (ఆంధ్రజ్యోతి) : పత్తి చెట్లకు గ్లైఫోసెట్ గడ్డి మందు వాడటం వల్ల వాతావరణ కాలుష్యం అవుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి యమునా దుర్గా అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లీడి గ్రామ పరిధిలోని దుబ్బగూడెం గ్రామంలో రైతులుకు ఏర్పాటు చేసిన గ్లైఫోసెట్ నకిలీ విత్తనాలు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు తెలియని వ్యక్తుల వద్ద నకిలీ విత్తనాలను కొని మోసపోవద్దని, నాణ్యమైన ధృవీకరించబడిన విత్తనాలను అనుమతులు ఉన్న దుకాణాల్లో కొనాలని సూచించారు.

అటవీ అధికారుల బర్డ్ వాచ్



ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద అటవీ అటవీఅధికారులు

హాజీపూర్, మే16 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలంలోని గుడిపేట ఎల్లంపల్లి ప్రాజెక్టు శుక్రవారం అటవీశాఖ అధికారులు బర్డ్‌వాచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టులో నీరు చెట్లపై ఉండే పలు రకాల పక్షులను వీక్షించారు. 23 రకాల పక్షులు ప్రాజెక్టు వద్ద అవాసం ఉంటున్నట్లు గుర్తించామని లక్షెట్టిపేట రేంజ్ ఆఫీసర్ అత్తె సుభాష్ తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ ఆర్‌వో అఫీజొద్దీన్, గోపి, ఎఫ్ఎస్‌ఓలు అల్తాఫ్ హుస్సేన్, అహ్మద్‌లు ఉన్నారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

లక్షెట్టిపేట, మే 16(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండల విద్యాధికారిగా శైలజ శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతకాలం ఎంఈవోగా పని చేసిన హెలన్‌డార్తి ఇటీవల పదవి విరమణ పొందగా ఆమె స్థానంలో పట్టణంలోని బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న శైలజ కార్యాలయంలో అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఎంఈవోను వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పేరుకే రెవెన్యూ డివిజన్..

- డివిజన్, మండలాల ఏర్పాటుతోనే సరి
- శిథిలావస్థలో, అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- భవన నిర్మాణాలు చేపట్టని వైనం...
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజలు



సింగరేణి క్వార్టర్‌లో కొనసాగుతున్న బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయం

బెల్లంపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్, మండలాలు ఏర్పాటైన సొంత భవనాలు లేకపోవడంతో అసౌకర్యాల నడుమ పాలన కొనసాగుతోంది. నియోజకవర్గకేంద్రమైన బెల్లంపల్లిలో రెవెన్యూ డివిజన్ కావడంతో ఆర్డీవో కార్యాలయంతో పాటు డివిజన్‌స్థాయి కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే నియోజకవర్గంలో నూతనంగా కన్నెపల్లి మండలం సైతం ఏర్పాటు కావడంతో తహసీల్దార్ కార్యాలయంతో పాటు వివిధ మండలశాఖ కార్యాలయాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. ప్రజా అవసరాలను తీర్చే ప్రభుత్వ అధికారులు కొలువై ఉండే ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అధ్వాన పరిస్థితుల నడుమ కొనసాగుతున్నాయి. ఏండ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేకపో వడంతో ప్రజలతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వందల ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఉన్న ప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవన నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రజా ప్రతినిధులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పేరుకే రెవెన్యూ డివిజన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన చేపట్టి కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే క్రమంలో బెల్లంపల్లిని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యాక ఆర్డీవో, ఏసీపీ, డీఎల్‌పీవో, ఏడీఏ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. అలాగే బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌లో కన్నెపల్లి మండలం సైతం నూతనంగా ఏర్పడింది. తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. ఇదంతా బాగానే ఉన్నా ఈ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సింగరేణి క్వార్టర్లలో బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం, ఏసీపీ కార్యాలయం, ఏడీఏ కార్యాలయం, సింగరేణి స్కూల్ భవనంలో తహసీల్దార్ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. అలాగే కన్నెపల్లి మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఓ అద్దె భవనంలో కొనసాగుతుంది. తహసీల్దార్ కార్యాలయం పాఠశాల భవనంలో కొనసాగుతుంది. శిథిలావస్థలో ఉన్నపాత భవనంలో పోలీస్‌స్టేషన్ కొన సాగుతుంది. ప్రజల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావాలంటే పూర్తి స్థాయిలో ఉద్యోగులతో పాటు అవసరమైన భవనాలు, వసతులు కలిగి ఉండాలి. కానీ అందుకు విరుద్ధంగా రెవెన్యూ డివిజన్‌లో శిథిలావస్థలో ఉన్న, అద్దెభవనాల్లో కార్యాలయాలు కొన సాగు తున్నాయి.

● సమస్యల వలయంలో కార్యాలయాలు

నూతనంగా ఏర్పడిన రెవెన్యూ డివిజన్‌లో తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. వర్షాకాలంలో స్లాబ్ పెచ్చులూడి కింద పడిన సందర్భాలు ఉన్నాయి. అలాగే ఏడీఏ కార్యాలయం విషసర్పాలకు నిలయంగా మారుతుంది. శిథిలావస్థలో ఉన్న ఈ భవనంలో ఎప్పుడు పాములు సంచరిస్తూ ఉంటుండంతో వ్యవసాయ శాఖ అధికారులు...

(తరువాయి 7)

డెంగ్యూ అవగాహన ర్యాలీ



నస్పూర్‌లో డెంగ్యూ అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారులు

నస్పూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా నస్పూర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ అవగాహన ర్యాలీని జిల్లా ఉప వైద్యాధికారులు అనిత, సుధాకర్ నాయక్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద నుంచి నస్పూర్ గేటు, కలెక్టరేట్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగ్యూ నివారణలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ అందరూ భాగస్వామ్యం కావాలని, తద్వారా దోమల నిర్మూలన చేయవచ్చున్నారు. డెంగ్యూ లాంటి జ్వరాలు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో డెంగ్యూ నివారణకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డెంగ్యూ పరీక్ష నిర్ధారణలో ఆయుస్మాన్ భవ ఆరోగ్య కేంద్రాల వరకు డెంగ్యూ కిట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనిల్ కుమార్, శివప్రతాప్, అమన్, వెంకటేశ్వర్లు, సునిత, రమ్య, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, జగదీశ్, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో గల లక్ష్మీ గణపతి దేవాలయంలో శుక్రవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని స్వామి వారికి మామిడి పండ్ల రసంతో విశేష మహా చూత ఫల రసాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. చతుర్థి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రధాన అర్చకులు గంగారపు వంశీక్రిష్ణ శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, పూజా కార్యక్ర మాలు జరిగాయి. సాయంత్రం స్వామి వారికి ఫల రసాభిషేకాన్ని నిర్వహించారు. పూజ కార్యక్రమాల అనంతరం ఉత్సవ మూర్తుల విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించి పల్లకీ సేవ నిర్వహించారు. తీర్థ ప్రసాదాల వితరణ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రఘుపతిరావు తెలిపారు.

ఎంపీని పిలవకపోవడం అవమానించడమే



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

మందమర్రిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించకపోవడం, ఎక్కడ కూడా ఆయన ఫొటో లేకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం తెలంగాణ మాల మహానాడు నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, పట్టణాధ్యక్షుడు దాసరి రామన్న మాట్లాడుతూ కేవలం దళిత వర్గానికి చెందిన వాడైనందునే ఎంపీ వంశీకృష్ణను పిలువకుండా పదే పదే అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితులందరు దీన్ని ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగుల దుర్గయ్య, పాత వీరస్వామి, సొత్కు సుదర్శన్, సొత్కు విజయ్‌కుమార్, రాజయ్య, శీలం వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంఈవో

కోటపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలని ఎంఈవో వెంకటేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 15రోజులుగా కొనసాగుతున్న యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు బయట తిరగకుండా సెల్ ఫోన్‌లకు పరిమితం కాకుండా ఆటలు, పాటలు యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులకు ధృవీకరణ పత్రాలతో పాటు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సాయిప్ప, వలంటీర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు సకాలంలో వేతనాలు అందించాలి

జైపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జైపూర్‌లోని సింగరేణిథర్మల్ పవర్ ప్లాంటులో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా వదులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రతి నెల 7వతేదీలోగా వేతనాలు అందించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో ప్రతి కాంట్రాక్టర్‌కు 7వ తేదీలోపు సెక్యూరిటీ గార్డులకు వేత నాలు ఇవ్వాలని సర్క్యులర్ ఉందని, కానీ సర్క్యులర్‌ను తుంగలో తొక్కి సింగరేణి యాజమాన్యం వేతనాలు సక్రమంగా అందించడం లేదన్నారు. ఈ నెల ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడంతో సెక్యూరిటీ గార్డుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించాలని కొత్త కాంట్రాక్టర్‌ను నియమించాలని కోరారు. వేతనాలు ఎందుకు జాప్యం చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సింగరేణి సీఎండీ బలరాం స్పందించి కాంట్రాక్టు కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకు ప్రతి నెల సక్రమం గా వేతనాలు అందించాలని కోరారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాలకలెక్టరేట్, మే16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ధాన్యం సేకరించాలని రాష్ట్ర పౌరసరఫ రాల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ సీఎస్ రామకృష్ణరావులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వంప్రత్యేక చర్యలు తీసుకుంటుందని నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి కనీస మద్దతు ధర చెల్లిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. సన్నరకం ధాన్యానికి మద్ధతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి సదుపాయం, గోనే సంచులు, తార్పాలీన్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో రికార్డుస్థాయిలో ధాన్యం పండిందని 129లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని పేర్కొ న్నారు. లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని సూచించారు. ధాన్యం నిల్వ చేసేందుకు ఇంటర్‌మీ డియట్ గోదాములు, వర్షాల వల్ల తడవకుండా అప్ర మత్తంగా అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభు త్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీలో ఎలాంటి అవాంత రాలు చోటుచేసు కోకుండా పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీ పక్ మాట్లాడుతూ జిల్లాలో 345కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 292 కొనుగోలు ద్వారా 14,281 మంది రైతుల వద్ద నుంచి లక్ష 12వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాల్లో 97కోట్ల 63లక్షల రూపాయలను జమ చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీఎస్ఓ బ్రహ్మారావు, డీఎం శశికళ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలకలెక్టరేట్, మే16 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోడి నాయకత్వంలో భారత సైన్యం చేపట్టిన సింధూర్‌తో ఉగ్రమూకల అంతం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ ఎర్రబెల్లి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాంలో భారత పౌరులపై పాశవికంగా దాడి చేసిన ఉగ్రవాదులను మట్టికరిపిం చిన ప్రధాని మోదీకి, సైన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజ కీయాలకు అతీతంగా ఈ అంశాన్ని ప్రతిఒక్కరు అభినందించాలన్నారు. నాయకులు రాజు కుమార్, వెంక టకృష్ణా, దుర్గం అశోక్, గాజుల ముకేశ్‌గౌడ్, తులా ఆంజనేయులు, కర్రె లచ్చన్న, జోగులు శ్రీదేవి, బింగి ప్రవీణ్, కమలాకర్‌రావు, చక్రవర్తి, చిరంజీవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

కోటపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాల సంద ర్భంగా 63వ జాతీయ రహదారి గుండా ప్రయాణించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా భద్రత ఏర్పాట్లు పూర్తి చేశామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్ర వారం మండలంలోని పారుపెల్లి వద్ద 63వ నెంబరు జాతీయ రహదారిపై పోలీసు బందో బస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో, రిజర్వు ఫారెస్టు సమీపం లో బ్లూకోర్ట్స్ పోలీసు పెట్రోకారు సిబ్బంది మూడు విడతలుగా 24గంటల పాటు విధులు నిర్వ ర్తిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తెలం గాణ-మహారాష్ట్ర అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. రానున్న బక్రీద్ సంద ర్భంగా అక్రమంగా పశువుల రవాణా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. చెక్‌పోస్టు వద్ద నిరంతరం నిఘా పెట్టాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అలాగే మహారాష్ట్ర నుంచి తెలం గాణకు ధాన్యం రాకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎవరైనా విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామ న్నారు. ఆయన వెంట జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేందర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

మంచిర్యాకలెక్టరేట్, మే16 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేషానుసారం జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపుకార్డులు, ధృవపత్రాలు పంపిణీ చేసినట్లు జిల్లా సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో అర్హతగల 7 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపుకార్డులు, ధృవపత్రాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ జూనియర్ అసిస్టెంట్ శ్రీరామమూర్తి, ఎఫ్ఆర్‌వో ఎండీ ఫర్హానా బేగం, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

కోటపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లింగన్న పేట, రొయ్యలపల్లి గ్రామాల్లో ఆదివాసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం వచ్చి 19 సంవత్సరాలు అవుతున్నా నేటికి పోడు సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. పోడు సాగు దారులను వ్యవసాయం చేయవద్దని అటవీ శాఖ అధికారులు బెదిరించడం సరైంది కాదని పేర్కొన్నారు. సాగులో ఉన్న ప్రతి ఎకరానికి హక్కు పత్రాలు ఇవ్వాలని, ఫారెస్టు అధికారుల బెదిరింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కా ర్యదర్శి ఎర్మ పున్నం, సిడాం సమ్మక్క, చిన్నన్న, భీమయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

భూభారతితో సమస్యలకు పరిష్కారం

● కలెక్టర్ కుమార్ దీపక్





బలరావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, దండేపల్లిలో తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్

దండెపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలన్నింటికి పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం భూభారతి, నూతన ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియను తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2 నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సుల కోసం అధికారులు రికార్డులతో సిద్ధంగా ఉండాలన్నారు. నూతన చట్టంలో రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులు, వారసత్వ భూములకు విరాసత్ చేసే ముందు సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. దండెపల్లి, కొర్విచెల్మ, నంబాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వహకులకు సూచించారు. మద్దతు ధరతో పాటు సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్ పొందేందుకు ప్రభుత్వ సెంటర్లలోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. ఆయనతో పాటు మండల అధికారులు ఉన్నారు.

సాదా బైనామా దరఖాస్తులు పరిశీలించండి

లక్షెట్టిపేట: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను, సాదా బైనామాలను భూబారతి ద్వారా పరిష్కరిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో భూబారతి, కొత్త ఆహార బద్రత కార్డు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతిలో దరకాస్తులను పరిష్కరించేందుక చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి రికార్డులను పూర్తి స్థాయి ఏర్పాటు సిద్ధంగా ఉంచాలన్నారు. రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసుకునే ముందు బూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి మ్యాప్‌లో నమోదు చేస్తామన్నారు. అంతే కాకుండా వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసేముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఆహార బద్రత కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఉన్నారు.